క్లుప్తంగా

థ్యాంక్యూ సీఎం సార్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 98 డీఎస్సీ టీచర్లు

చీమకుర్తి: మండలంలో ఎంపికైన 98 డీఎస్సీ టీచర్లు గురువారం సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కాలేజీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు. 98 డీఎస్సీలో ఎంపికైన టీచర్స్ డైట్ కాలేజీలో వృత్త్యంతర శిక్షణ పొందుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాలాభిషేకం చేశారు. 98 డీఎస్సీలో క్వాలిఫై అయిన తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారంటూ డీఎస్సీ–98 బ్యాచ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.బాలిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి.వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: రామ్‌నగర్ 7వ లైన్‌లో చర్చి నిర్మాణానికి మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి గురువారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. పాస్టర్ శ్యామ్ విజ్ఞప్తి మేరకు చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని చేసిన విజ్ఞప్తి మేరకు వెంకారెడ్డి సాయం అందించినట్లు తెలిపారు.

వేసవి తరగతులు ఉపయోగపడాలి



పోటీలు నిర్వహిస్తున్న గ్రంథపాలకురాలు

నాగులుప్పలపాడు: వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండటానికి కృషి చేస్తున్నట్లు గ్రంథపాలకురాలు నాగరజని అన్నారు. ఉప్పుగుండూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో గురువారం చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించి అంత్యాక్షరి పోటీలు పెట్టారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ఒంగోలు రూరల్: త్రోవగుంట జిల్లా పరిషత్ హైస్కూలులో పలువురు 14 మంది విద్యార్థులు కేవలం ఒక్క మార్కుతో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎం చెల్లా బ్రహ్మయ్య పర్యవేక్షణలో ఆయా సబ్జెక్టు నిపుణులు సూక్ష్మంగా విద్యార్థుల మనస్సులో ఉన్న అభద్రత భావాన్ని తొలగించేందుకు తగు చర్యలు మానసికంగా దృఢంగా ఉండేందుకు మనోధైర్యాన్ని నింపుతున్నారు. కార్యక్రమానికి త్రోవగుంట గ్రామస్తుడు, నాయకులు పాల్గొన్నారు.

పొగాకు అమ్మకాలు

ఒంగోలు రూరల్: ఒంగోలు వేలం కేంద్రం–2లో 777 పొగాకు బేళ్ళు రైతులు అమ్మగా వ్యాపారులు కొనుగోలు చేశారు. గురువారం మొత్తం 788 బేళ్ళు వేలం కేంద్రానికి వచ్చాయి. గరిష్ట ధర రూ.201, కనిష్ట ధర రూ.170, సరాసరి ధర రూ. 199.41 గా నమోదయినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

కొత్తపట్నం: మండలంలో ఈతముక్కల గ్రామ పంచాయతీ ఆవరణలో లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పది సంవత్సాలు పూర్తి చేసుకుని 11వ సంవత్సరం అడుగుపెడుతున్న సందర్భంగా మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ రవీంద్రరెడ్డి సౌజన్యంతో ఈ నెల 21న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నరాలకు సంబంధించిన ఏ సమస్య అయినా, జనరల్ సర్జరీ, స్త్రీల సంబంధిత, చిన్న పిల్లలకు సంబంధిత, సాధారణమైన వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయనున్నారు. శిబిరంలో న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి, జనరల్ సర్జరీ నిపుణులు డాక్టర్ కె.శశిధర్‌రెడ్డి, ఓబీజీ నిపుణులు డాక్టర్ లక్ష్మీరేఖ, చిన్న పిల్లల విభాగ నిపుణులు డాక్టర్ షేక్ అహ్మది సల్మా సుల్తాన్ పరీక్షలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమృత సరోవర్ నీటి చెరువుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, పీడీ శీనారెడ్డి, సర్పంచ్ మాధవి

ఆలూరు (కొత్తపట్నం): గ్రామస్తులకు నీరు అవసర నిమిత్తంగా ఆలూరు గ్రామానికి అమృత సరోవర్ పథకం నుంచి నీటి చెరువుకు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎన్ఆర్‌జీఎస్ పీడీ శీనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీపీ, పీడీ, ఎంపీడీవో సుజాత, సర్పంచ్ పూనూరు మాధవి, శైలేష్, ఏపీవో రత్నజోత్స్న, గ్రామస్తులు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఎన్ఆర్‌జీఎస్ కూలీలచే పని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆలూరు గ్రామానికి నీటి సమస్య ఉందని, నీరు ఉపయోగించుకునే విధంగా చెరువును తవ్వాలన్నారు. చుట్టూ వెడల్పు కట్ట పోసి మొక్కలు నాటుకోవాలని సూచించారు. వర్షం పడిన నీరు బయటకు పోకుండా నిల్వ ఉండే విధంగా కట్టలు పోసుకోవాలని పేర్కొన్నారు. వరదలు వచ్చినప్పుడు నీరు లోనికి వచ్చే విధంగా ఒక పక్క దూము నిర్మించి మెట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నిల్వ చేసిన నీరును కష్టకాలంలో ఇంటి నిర్మాణాలకు, పశువులకు ఉపయోగించుకోవచ్చున్నారు. పీడీ మాట్లాడుతూ అమృత సరోవర్ పథకం ద్వారా రూ.6.90 లక్షలతో ఆలూరు గ్రామానికి నిధులు మంజూరయ్యాయని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. చెరువు లోపల హెచ్చు తగ్గులు లేకుండా చదునుగా చేసుకోవాలని వివరించారు. నీరు ఎక్కువైనప్పుడు బయటకు వెళ్లడానికి, అసరం మేరకు నీరు లోనకు రావడానికి తూములు ఏర్పాటు చేయటానికి మెటీరియల్ కోసం అదనంగా రూ.2 లక్షలు ఇచ్చే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్ఆర్‌జీఎస్ జేఈ చంద్రశేఖర్, టీఏ అచ్చుబాబు, సచివాలయం కన్వీనర్ పాలేటి రమణ, పల్లబోలు జానికిరామిరెడ్డి, ఆరుమాళ్ళ రాఘవరెడ్డి, గాదె శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కొండయ్య, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నీలంపాలెంలో విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



బుధవారం రాత్రి చీకట్లో నీలం పాలెం



గురువారం కరెంటు వెలుగుల మధ్య..

ఒంగోలు టౌన్: విద్యుత్ తీగలు తెగి పడిపోవడంతో గత రెండురోజులుగా నగరంలోని పాత కూరగాయల మర్కెట్ వద్ద గల నీలంపాలెంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గురువారం సాక్షిలో 'నీలం పాలెంలో తెగిన విద్యుత్ తీగలు' అని వార్త ప్రచురణ కావడంతో విద్యుత్ అధికారులు రంగంలోకి దిగారు. ఏఇ ఎస్. శివప్రసాద్ 13 మంది సిబ్బందితో గురువారం మరమ్మతులు చేపట్టారు. మూడు స్తంభాలను మార్చారు. దీంతో గురువారం విద్యుత్ సరాఫరా చేశారు. రెండు రోజులుగా ఇబ్బంది పడిన ప్రజలు కరెంటు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

పుస్తక పఠనంతో పరిపూర్ణ విజ్ఞానం



విద్యార్థులకు పుస్తక పఠనం గురించి వివరిస్తున్న చైర్మన్ మస్తాన్ వలి

కొత్తపట్నం: పుస్తకాలు చదవటం వలన కొత్త విషయాలు నేర్చుకోవడమే కాక పరిపూర్ణ విజ్ఞానం అందిపుచ్చుకోవచ్చని ఉర్దూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం పుస్తక పఠనం, చిత్రలేఖనం, చిన్న చిన్న కథలు నేర్పించడం కార్యక్రమం నిర్వహించి పిల్లలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఏకాగ్రత పెంచుకోవడం, వీడియోగేమ్స్ వలన నష్టాలను గురించి వివరించారు. తల్లిదండ్రులను గౌరవించడం వారు చెప్పిన పద్ధతులు పాటించడం, విద్యార్థులు ప్రవర్తన, బాధ్యతలు గురించి చెప్పారు. గ్రంథపాలకులు సీహెచ్ అజయ్‌బాబు మాట్లాడుతూ బాల్య వయస్సులో మొబైల్ వాడటం వలన వచ్చే నష్టాలు గురించి తెలియజేశారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు పిల్లలను పంపించవలసిందిగా తల్లిదండ్రులను కోరారు. కొత్తపట్నం గ్రంథాలయాలనికి 1,800 పుస్తకాలు వచ్చాయని గ్రంథాలయంలో సభ్యత్వం పొంది ఉపయోగించుకోవలసిందిగా కోరారు. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓపై ఆరోపణలు సరికాదు

ఒంగోలు అర్బన్: డీఎంహెచ్ఓపై కొన్ని సంఘాలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని ప్రభుత్వ డాక్టర్లు, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. రాహుల్, సెక్రటరీ డాక్టర్ రత్నం, డాక్టర్ సుందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుడు ఆరోపణలతో అభియోగాలు మోపాడం బాధాకరమన్నారు. కేవలం స్వలాభాల కోసం అధికారులు, ఉద్యోగులపై అసత్యం ఆరోపణలు, ఫిర్యాదులు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా నిబంధనల మేరకు మాత్రమే జరుగుతాయన్నారు. సదరు సంఘాలు ఆరోపిస్తున్న ఆరోపణలకు సంబంధించి బాధితులు ఫిర్యాదులు చేయలేదన్నారు. స్వప్రయోజనాల కోసం అధికారులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగితే బాధితులు ఫిర్యాదు చేయాలని కానీ సంఘాలు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

నియామకాలపై విచారణ జరపాలి

డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు, ఉద్యోగ నియామకాలు జరిగాయని వాటిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలన మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు సృజన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశానికి వచ్చిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఆరోపణలపై విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

పశు పోషకుల అవగాహన సదస్సు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రతిమ

ఒంగోలు రూరల్: మండలంలోని వలేటివారిపాలెంలోని రైతు భరోసా కేంద్రంలో ఉలిచి పశు వైద్యాధికారి ఐ.ప్రతిమ ఆధ్వర్యంలో పశు పోషకులు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం వేసవిలో పాడి పశువులు పోషణలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన సదస్సు కొనసాగింది. డాక్టర్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వేసవిలో పాడిపశువులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. పాడి రైతులు వారి వారి పశువులను చల్లటి సమయంలో మేపడం .. తగినంత స్వచ్ఛమైన తాగునీరు అందించడం సరైన గృహ వసతి ఏర్పాటు చేయాలన్నారు. పశువుల కోసం గోనె సంచులతో కూడిన పరదాలను ఏర్పాటు చేసి చల్లటి నీటితో తడుపుతూ ఉండాలని అప్పుడే వడదెబ్బకు గురికాకుండా ఉంటాయన్నారు. సాధారణంగా వేసవిలో పాల దిగుబడి పడిపోతుందని పాల ఉత్పత్తి క్రమంగా పెరిగేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు పశుపోషణలో దాణామృతం ప్రాధాన్యత వివరించారు. కనిజ లవణ మిశ్రమం బలవర్ధక మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలేటివారిపాలెం సర్పంచ్ నలమోతు ఉషారాణి, గ్రామ కార్యదర్శి రంగారెడ్డి, కరవది వెట్నరీ లైజన్ ఆఫీసర్ లక్ష్మయ్య, వెట్నరీ అసిస్టెంట్ షేక్.జుబీర్, పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

ఒంగోలు: వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. వలంటీర్లు అందించిన ఉత్తమ సేవలకు గాను ప్రశంశపత్రం, దుశ్శాలువాతో సత్కారం, నగదు బహుమతి అందిస్తారు. నగర పాలక సంస్థ పరిధిలో 1169 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరిని వజ్ర అవార్డుకు ఎంపికచేశారు. వీరికి రూ. 30వేల చొప్పున అందిస్తారు. రత్న అవార్డులకు ఎంపికైన వారు 12 మంది ఉన్నారు. వారికి రూ. 20 వేల చొప్పున 12 మందికి మొత్తంగా రూ. 2.40 లక్షలు అందిస్తారు. మిగిలిన 1155 మందికి రూ. 10 వేలు చొప్పున రూ. 1.15 కోట్లు అందించనున్నారు.

పేదలకు చెప్పుల పంపిణీ



పేదలకు చెప్పులు, గొడుగులు పంపిణీ చేస్తున్న శివం ఫౌండేషన్ సభ్యులు

ఒంగోలు అర్బన్: శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, భిక్షాటన చేసే వారికి చెప్పులు, గొడుగులు పంపిణీ చేశారు. ప్రకాశం భవనం వద్ద బాపూజీ మార్కెట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోడూరి సత్యనారాయణ, శ్రీనివాసరావు చేతుల మీదుగా ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. వారు మాట్లాడుతూ తీవ్రమైన ఎండలు సమయంలో పేదలకు, నిరాశ్రయులకు సహాయ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా నిత్యం అన్నదాన కార్యక్రమంతో అనాథల కడుపు నింపుతున్న శివం ఫౌండేషన్ సేవలు హర్షణీయమన్నారు. మారెళ్ల సుబ్బారావు, పాల్గొన్నారు.

గంజాయి అమ్మకాలు చట్టరీత్యా నేరం



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ, ఎస్సై సురేష్

చినగంజాం: గంజాయి అమ్మకాలు సాగించడం చట్టరీత్యా నేరమని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మోటుపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సీతారామాలయంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గంజాయి అమ్మడం, తీసుకోవడం నేరం అని వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అదే విధంగా గ్రామాలలో దేవాలయాలు, నివాస గృహాల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కే సురేష్, గ్రామ కాపులు, పెద్దలు పాల్గొన్నారు.

బడి తెరిచే నాటికి జగనన్న కానుక



సంతనూతలపాడులో జేవీకే కిట్‌లను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

చీమకుర్తి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తీసే నాటికి పిల్లల చేతిలో జగనన్న విద్యాకానుక కిట్లు ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అధికారులకు తెలిపారు. గురువారం ఆకస్మికంగా డీఈఓ సంతనూతలపాడులో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఎంఈఓ సనత్ కుమార్‌తో కలిసి జేవీకే కిట్ల నాణ్యతను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి జేవీకే కిట్లను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓని ఆదేశించారు. అనంతరం నాడు–నేడు ఫేజ్–2లో జరుగుతున్న పాఠశాలల మరమ్మతుల పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి నాడు–నేడు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పే విధంగా చూడాలన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే,మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. పాత కూరగాయల మార్కెట్ వద్ద మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఏర్పాటు చేశారు. బాలినేని మాట్లాడుతూ మండు వేసవిలో ప్రజల యొక్క దాహార్తి తీర్చేందుకు గత పది సంవత్సరాలుగా మహబూబ్ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాదచారులకు, కార్మికులకు ఉపయోగపడుతుందని పేర్కొంటూ అభినందించారు. షేక్ మహబూబ్ మాట్లాడుతూ తనకు ఉన్నదాంట్లో కొంతవరకైనా పేదలకు ఉపయోగపడాలనే లక్ష్యంతో గత పది సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి శంకర్, గొర్రెపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇంతియాజ్, పి. కృష్ణారెడ్డి, షేక్ జాని, షేక్ అల్లాభక్షు, జడ శ్రీనివాసరావు, తూము వెంకట్రావు, ఒంగోలు బుజ్జి, ఎందేటి వెంకట్రావు, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

జూన్ 4 వరకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కమిషనర్, మున్సిపల్ సిబ్బంది

చీమకుర్తి: మేరా లైఫ్, మేరా స్వచ్ఛనగర్ కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఆర్ఆర్ఆర్‌పై అవగాహన కల్పించేందుకు చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో తమ సిబ్బందితో కలిసి గురువారం ప్లకార్డులను ప్రదర్శించారు. నెహ్రూనగర్ 6వ వార్డు పరిధిలో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, చెక్క కుర్చీలు, మంచాలు, ఇతర ఏ రకమైన వస్తువులైనా వాటిని ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో ఉంచితే వాటిని అవసరమైన వారు తీసుకెళ్ళి తిరిగి ఉపయోగించుకుంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, చీమకుర్తి పట్టణంలో ప్రతి ఒక్కరూ తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధిపై మహిళలతో సమీక్ష



మాట్లాడుతున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత సంతనూతలపాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం ముందంజలో ఉందని పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎస్ఎస్ఎన్ కాలేజీ సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో స్థానిక మహిళలతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. మహిళలకు జగనన్న చేసిన పనులను వివరించారు. జగనన్న కాలనీలు, రోడ్లు, కాలువలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య భవనాల వంటి నిర్మాణాలు జగనన్న పాలనలోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తినేని శ్రీనివాసరెడ్డి, అనిల్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో శిద్దా దంపతులు



శ్రీవారి సన్నిధిలో మాజీ మంత్రి శిద్దా దంపతులు

ఒంగోలు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిద్దా రాఘవరావు దంపతులు గురువారం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుప్పావడ సేవలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు రంగనాయక మండపంలో శిద్దా దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలతో వేద ఆశీర్వచనాలు అందజేశారు.

చేనేత వృత్తి రక్షణ కోసం ఐక్య ఉద్యమం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల: వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్ద రంగమైన చేనేత రంగం రక్షణకు ఐక్య ఉద్యమాలు అవసరమని చేనేత సంఘాల రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. గురువారం చీరాల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో చేనేత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చేనేత నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు మల్లికార్జున, వై.కోటేశ్వరరావు, ఎం.మోహనరావు, బాలకృష్ణ, నాగేశ్వరరావు, కొండయ్య, సుబ్బారావు, అధిక సంఖ్యలో చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ చట్టసభల్లో ఉన్న చేనేత సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు చేనేతల సమస్యల పరిష్కారానికి, చేనేతల సంక్షేమానికి పాటుపడాలన్నారు. చేనేతలకు అవసరమైన నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాలను ప్రభుత్వమే 40 శాతం సబ్సిడీతో అందిస్తే చేనేతలకు ఎనలేని మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.